# ఈ అనుభవం చాలు

నందం రామారావు

**(గతసంచిక తరువాయి)**

'బాలరాజు గారూ! మీరు కొంత కాలం మీ 'భార్యకు దూరంగా వుండాలి. తప్పదు.'

'డాక్టర్!'

'ఆమెకు గర్భాశయంలో పుండు వుంది. అది నయం కావడానికి నెల రోజుల పైన పట్టవచ్చు. అవసరమైతే ఆపరేషన్ చేయాలి. మందులు మాత్రం వాడటం తప్పని సరి. రెండు-మూడు రోజులకోసారి తీసు కొచ్చి చెకప్ చే యించండి.'

'అలాగే' అం టూ బాలరాజు తలూపాడు. భార్య కు గర్భకోశంలో పుండు వున్నదన్న విషయం తెలియగానే బాల రాజు ఆందోళన చెందాడు. తమ సంతోషాల్ని చూడలేని దేవుడు, ఈ రూపంతో పగ తీర్చుకుంటున్నాడని విలవిల్లాడిపోయాడు. తాము ఎవరికీ అపకారం, అన్యాయం చెయ్యలేదు. ఆరోగ్యసూత్రాలు అన్నీ పాటిస్తూనే వున్నారు. ఆరోగ్యంగా వున్న తన భార్యకే ఇదెందుకు రావాలి?

బాలరాజు తనలో మథనపడినా, పైకి మాత్రం భార్య దగ్గర ఎంతో సంతోషంగా వుండేవాడు. దిగులనేది ఏ మాత్రం కనబడనీయకుండా జాగ్రత్తపడేవాడు. తను దిగులుపడుతున్నట్లు తెలిస్తే, భార్య తట్టుకోలేదు. భార్యకు దగ్గరుండి అన్ని పనులూ చేసేవాడు. వేళకు మందులూ, భోజనం సమకూర్చేవాడు.

పాపం! పారిజాతం కూడా దిగులుపడింది. యజమానురాలికి ఈ మాయదారి రోగం రాకుండా వుంటే ఎంతో బావుండేదని పదే పదే అనుకునేది. అమ్మగారికి త్వరగా నయం కావాలని దేవుడిక్కూడా మొక్కుకుంది. రేఖమ్మ గారి పక్కనే వుండి అన్నీ చూసేది.

000

ఆ రోజు...

రాత్రి ఎనిమిది గంటలు దాటిన తర్వాత బాలరాజు ఇంటికెళ్లాడు. హాల్లో పారిజాతం కింద కూర్చుని ఏదో పుస్తకం చూస్తోంది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఇదివరకైతే ఈ టైమ్‌లో రేఖ భర్త కోసం ఎదురు చూస్తూ, చదువుకుంటూనో, నచ్చినపాటలు వింటూ నో లేదా టివి చూస్తూనో వుండేది!

బాలరాజు రావడం చూసిన పారిజాతం గభాల్న లేచి. 'అమ్మగారు గదిలో పడుకున్నారండి' అంది.

బాలరాజు, రేఖ పడుకున్నగదిలో కెళ్లి, 'ఏం ప్రియతమా! ఎలా వుంది వొంట్లో' అన్నాడు.

కళ్లు మూసుకున్న రేఖ కళ్లు తెరచి, భర్త కేసి చిన్నగా నవ్వి 'ఎలా వున్నాను?' అంది.

'సౌందర్యరాశిగా వున్నావ్. అమాంతం కొరికెయ్యాలనిపిస్తోంది' అన్నాడు.

ఆ మాటకి రేఖ అందంగా నవ్వింది.

'రేఖా! ఈ మందులు జాగ్రత్తగా వాడు. పది రోజుల్లో నీ ఆరోగ్యం బావుంటుందని డాక్టర్ చెప్పింది.'

'నిజమేనా?'

'నిజమే రేఖా! ఓ పది రోజుల్లో నీ ఆరోగ్యంలో మార్పు రాలేదనుకో. నేనే గొప్ప వైద్యం చేస్తాను.'

'ఆ మీ వైద్యం ఏవిటో నాకు తెలుసులేండి. ఏ ఢిల్లీకో, బొంబాయికో లేదా అమెరికాకో తీసుకెళ్లి, గొప్ప డాక్టర్లకు చూపిద్దామంటారు. అంతేనా?' భర్తని దగ్గరకు రమ్మని సైగ చేసింది.

బాలరాజు, భార్య పక్కన కూర్చుని చేయి పట్టుకుని నిమురుతూ, 'చూడు రేఖా! నేను సర్వరోగాలూ తగ్గడానికి ఒకే ఒక్క మందు కనిపెట్టాను. పడిశం, తల నొప్పి, జ్వరం, ఆయాసం, నొప్పులు అన్నీ మటుమాయం. పథ్యం లేదు. ఏదైనా సరే తినొచ్చు.'

రేఖ మంచం మీద నుండి లేవబోయింది.

బాలరాజు ఆమెను వారించి, 'అంత మహత్యం గల మెడిసిన్ మనం, అనగా ది గ్రేట్ బాలరాజు కనిపెట్టాడు' నవ్వుతూ అన్నాడు.

'ఏవిటో అది?'

బాలరాజు ముందుకు వంగి రేఖ జుట్టులోకి వేళ్లు పోనిచ్చి, నుదురు ముద్దు పెట్టుకుని 'ఏం లేదు ప్రియా! వెరీ సింపుల్. మొగుడూపెళ్లాలు హుషారుగా తెల్లవార్లూ పట్టడాం అనుకుంటే చాలు' అన్నాడు నవ్వుతూ.

''ఆ... ఆ.. చాలు! అయ్యా! మహ ప్రభూ! మీరు చెప్పిన చిట్కా గనుక చేశారా. తెల్లారేసరికి 'ఢం' అంటారు. దేశంలో జనాభా తగ్గడానికి మంచి మందే కనిపెట్టారు.'

బాలరాజు, భార్య ముఖంలోకి పరిశీలనగా కొన్ని క్షణాలు చూశాడు. ఆమె చిక్కి, శల్యమైంది. మునుపటి ఉత్సాహం కనిపించడం లేదు. ముఖం పాలిపోయి దీర్ఘకాలంగా మంచాన్ని అంటిపెట్టుకున్న రోగిలా వుంది.

అలా భార్యను చూస్తున్న కొద్దీ ఏదో తెలీని ఆందోళన, భయం, ఒక్కసారిగా బాలరాజును చుట్టుముట్టాయి. కళ్లల్లో నీళ్లు తిరుగుతూ వుండగా, ''రేఖా!'' అంటూ చిన్న పిల్లాడిలా భార్యను పెనవేసుకుని బావురుమన్నాడు.

అప్పటి వరకూ భర్త సంతోషంగా వుండి, ఇప్పుడీ క్షణం ఇంతలా దుఃఖపడటం రేఖకు కూడా బాధే అనిపించింది.

'ఎందుకలా విచారిస్తారు? నాకు త్వరలోనే నయమవుతుంది గదా! మళ్లీ మనం మామూలుగానే వుంటాం.' భర్త చేతులు పట్టుకుని తలని వంచి ముద్దు పెట్టుకుంది రేఖ.

000

దాదాపు నాలుగు నెలలు గడిచాయి

రేఖ పూర్తిగా కోలుకుంది.


ఈ మధ్య కాలంలో భార్యాభర్తలు దూరంగానే వున్నారు.

అభిమానాలూ, ఆప్యాయతలూ, ఒకరిమీద ఒకరికి ప్రేమా, ఏ మాత్రం తగ్గలేదు

000

ఆ రోజు, బాలరాజు ఆఫీసుకెళుతూ, 'చూడు రేఖా డియర్! ఈ రోజు పెందలాడే వచ్చేస్తాను. వచ్చేటప్పుడు మల్లెపూలు తీసుకొస్తాను ఓ.కే నా?' అన్నాడు.





రేఖ నవ్వి వూరుకుంది.

ఇంటికి ఎంత త్వరగా రావాలని ప్రయత్నించినా, బాలరాజుకి కుదరలేదు. ఆఫీసుకు వెళ్లిన దగ్గర నుంచి ఏవేవో పనులు, ఎవరో ఒకరు రావడం. రాత్రి పదిగంటలు దాటుతుండగా, హడావుడిగా ఇంటికొచ్చాడు బాలరాజు. నౌకరు యాదయ్య టి.వి. చూస్తూ కూర్చున్నాడు. వాడ్ని తలుపు వేసుకుని పడుకోమని చెప్పి గబగబా తన బెడ్ రూమ్‌లో అడుగు పెట్టాడు.

ఆ గదంతా చీకటిగా వుంది. అగరువత్తుల వాసన... మల్లెపూల గుబాళింపు...

కోటికోరికలతో
అంతు లేని ప్రేమతో
నరాల పటుత్వంతో
ఆ చీకటి గదిలో అడుగులో అడుగు వేసుకుంటూ

'రేఖా' అంటూ బెడ్ మీద వాలాడు బాలరాజు.

బాలరాజు బెడ్ మీద వాలిన మరుక్షణం రెండు బలమైన చేతులు బాలరాజును గట్టిగా పెనవేసుకున్నాయి

ఆ ఇద్దరి మధ్య కాలం స్తంభించినట్లయింది

గాలి స్తంభించింది.
చీకటి కళ్లు తెరవలేదు.
కళ్లు తెరవని చీకటిలో
రెండు కాళ్లు గది వరకూ వచ్చి
కొన్ని క్షణాలు ఆ గది దగ్గర ఆగాయి!

0 0 0

తెల్లవారింది.

బాలరాజు నిద్ర లేచి భార్య కోసం చూశాడు.

రేఖ కిచెన్‌లో టిఫిన్ చేసే ప్రయత్నంలో వుంది.

బాలరాజు నెమ్మదిగా పెరట్లో కెళ్లాడు.

నూతి దగ్గర పారిజాతం బట్టలు వుతుకుతోంది.

బాలరాజు ఆమె దగ్గర కెళ్లి, 'చూడు పారిజాతం! నువ్వు రేపటి నుంచి పనిలోకి రావద్దు. ఎందుకు రావద్దంటున్నానో నీకు బాగా తెలుసు రాత్రి నా గదిలో నా బెడ్‌మీద నువ్వు పడుకున్నావనే విషయం కొంచెం ఆలస్యంగా తెలుసుకోగలిగాను. అప్పటికి నేను చేయగలిగింది ఏం లేదు. ఎందుకిలా జరిగిందని ఆలోచించినందువల్ల ప్రయోజనం కూడా ఏం లేదు. అమ్మగారి స్థానంలో నువ్వు ఎందుకు పడుకున్నావని కూడా నిన్ను అడగదలచుకోలేదు ఒక్కటిమాత్రం నిజం! రాత్రి నువ్వు అందించిన సుఖాన్ని జీవితంలో మరచిపోలేను. తప్పో, ఒప్పో జరిగిపోయింది. ఐతే, మళ్లా అటువంటి సుఖం కోసం నేను ఆశ పడను. పని లోంచి నువ్వెందుకు మానేస్తున్నావో కారణం ఆలోచించి, అమ్మగారికి నువ్వే చెప్పు. జరిగింది తప్పు గనుక ఇది మనిద్దరిలోనే వుండిపోనీయ్!' అని చెప్పి అక్కడ్నుంచి వొచ్చేశాడు.

రాత్రి జరిగింది రేఖ చూసిందని గానీ, ఇప్పుడు పారిజాతంతో మాట్లాడింది రేఖ విన్నదని గానీ, బాలరాజుకీ, పారిజాతానికీ తెలీదు. తెలిస్తే ఏం జరుగుతుందో మనం ఊహించవచ్చు! ఇప్పుడు బాలరాజు, పారిజాతంతో మాట్లాడింది విన్నది గనుక, రేఖ మనస్సు ఎంతో వూరట చెందింది.

0 0 0

జీవితంలో ఎవర్నో నమ్మి మోసపోయి వ్యథ చెందటం కంటే, ఒక్కసారి మనసైన వ్యక్తిని మోసగించి, మోసగించాడని అనిపించుకోవడం మంచిదని పారిజాతం అనుకుంది.

తను ఈ ఇంట్లో పనిమనిషిగా చేరిన దగ్గర నుండి, బాలరాజు-రేఖల దాంపత్యం చూసి సంతోషించింది. ప్రతి కుటుంబం ఇలాగే అన్యోన్యంగా, సంతోషంగా వుండాలని ఆశ పడింది. తన కాపురంలో సుఖం లేకపోయినా, రేఖ కాపురం చూసి ఈర్ష్యపడలేదు. వారెప్పుడూ కళకళ్లాడు తూ వుండాలనే కోరుకునేది. మనసు చంచలమైనది. బాలరాజును చూసినప్పుడల్లా, పారిజాతం మనసు మనస్సులోవుండేది కాదు. అల్లరి చేసేది. ఆ అల్లరితో ఏవేవో కోరికలు చెలరేగేవి. కోరికల ముందు తల వంచక తప్పలేదు. బాలరాజుతో పొందుకు అవకాశం కోసం చూసింది.

ఆ రోజు రాత్రి...

రేఖ వంట్లో బావుండలేదని వేరే గదిలో పడుకుంది. పారిజాతం ఆ అవకాశాన్ని జారవిడచదలచుకోలేదు.

తను రేఖగా నటించి, తన కోర్కెను తీర్చుకుంది.

జరిగిందానికి తను విచారించడం లేదు. బాలరాజును తను మోసం చేయాలనుకోలేదు. అతనితోనే వుండిపోవాలని కూడా అనుకోలేదు. తనెక్కడున్నా ఈ చేదు, తీపి అనుభవాన్ని నెమరు వేసుకుంటూ జీవితాంతం గడుపుతుంది. తనకదే తృప్తి. ఈ జీవితానికిది చాలు అనుకుంది పారిజాతం.

(అయిపోయింది)

## జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్ 4వ రాష్ట్రస్థాయి కథలు, కవితల పోటీలు

జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్ నాల్గవ రాష్ట్రస్థాయి కథలు, కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి తెలియజేస్తున్నారు. రచయిత తనకు ఇష్టమైన ఏదైనా అంశాన్ని ఎన్నుకుని కథ 8 పేజీలకు మించకుండా, కవిత ఒక పేజీకి మించకుండా వ్రాసి మార్చి 5 లోపు జి.వెంకటరెడ్డి, ఛైర్మన్, జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్, బి70/ఎఫ్1, పి.ఎస్.నగర్, విజయనగర్ కాలనీ, హైదరాబాద్–57 అనే చిరునామాకు పంపాలని తెలిపారు. తమ రచన ఇంతకుముందు ఏ పత్రికలోనూ ప్రచురితం కాలేదన్న హామీ పత్రాన్ని జతచేయాల్సి ఉంటుంది. ఈ పోటీలకు ఎటువంటి ప్రవేశ రుసుము లేదు. మొదటి నాలుగు ఉత్తమ కథలకు రూ.500/–, 300/–, 200/–, 100/– రూపాయలు, మొదటి నాలుగు ఉత్తమ కవితలకు రూ.350/–, 250/–, 150/–, 100/– రూపాయల చొప్పున నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తాము. విజేతలకు ఫౌండేషన్ 4వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా 3–4–2006 న సాయంత్రం హైదరాబాద్ లోని శ్రీ త్యాగరాయ గానసభలో బహుమతులు అందజేస్తామని ఆ సంస్థ ఛైర్మన్: గుదిబండి వెంకటరెడ్డి తెలియజేస్తున్నారు. ఇతర వివరాలకు 9849882783 నంబరుకు సంప్రదించగలరు.